స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

భారత్ సేవాశ్రమ్ నగర కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న స్వామి వెంకటేశ్వరానంద

కవాడిగూడ: నిరుపేదలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని భారత్ సేవాశ్రమ్ నగర కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద పిలుపునిచ్చారు. దీపావళి పండుగను పురస్కరించుకొని భారత్ సేవాశ్రమ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కులో పనిచేసే జీహెచ్ఎంసీ కార్మికులు, కూలీలకు చీరలు,దుస్తులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వామి వెంకటేశ్వరానంద ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... పేద ప్రజలను ఆదుకునేందుకు వారికి నిత్యం సహాయ సహకారాలు అందించేందుకు భారత్ సేవాశ్రమ్ పక్షాన పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ ప్రకృతి విపత్తు సంభవించినా అక్కడ ఉన్న నిరుపేదలకు సహాయం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ఇందిరాపార్కులో పనిచేసే సిబ్బందికి ఉచితంగా చీరలు, దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరాపార్కు అధికారులు సిబ్బంది. వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బెటాలియన్ పోలీసులకు న్యాయం చేయాలి

ముషీరాబాద్: రాష్ట్రంలో గత ఐదు రోజులుగా బెటాలియన్ పోలీసులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం వారి డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపకపోవడం విచారకరమని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కార్యదర్శి పోటు రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. నిత్యం ట్రాన్స్‌ఫర్స్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బెటాలియన్ పోలీసులతో పోలీసుల వృత్తికి బదులు ఇంటి పనులు, శుభ్రం పనులు, గడ్డి తీయించడం, వంటి పనులను వ్యతిరేకిస్తూ వన్ పోలీసు వన్ స్టేట్ అనే నినాదంతో వారు చేస్తున్న ఆందోళనకు తమ పార్టీ మద్దతు తెలియజేస్తుందన్నారు. పోలీసు వ్యవస్థలో ఉన్న మాదిరిగానే సెలవులు, పనులు, ట్రాన్స్‌ఫర్స్ విధానం కొనసాగించాలని కోరారు. ఆందోళనలు చేస్తున్న పోలీసులను అరెస్టు చేయడం.. పది మందిని ఉద్యోగాల నుంచి తొలగించడం.. మరో 15 మందిని సస్పెండ్ చేయడం చాలా అన్యాయం అన్నారు. తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని పోటు రంగారావు డిమాండ్ చేశారు.

బస్తీవాసులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు త్వరితగతిన ఇళ్లను కేటాయించాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయన బస్తీవాసులతో కలసి ముషీరాబాద్ తహసీల్దార్ కె.రాణాప్రతాప్‌సింగ్‌ను కలసి ఇళ్లను కేటాయించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొన్ని దశాబ్దాలుగా నివాసముంటున్న వారి ఇళ్లను తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జనవరి నెలలో తొలగించి ఇప్పటి వరకు వారికి పునరావాసం కల్పించకపోవడంతో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. రోజువారి పనిచేసుకుంటూ జీవనం సాగించే పేద దళిత కుటుంబాలను రోడ్డున పడేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను ఇళ్లను కేటాయించాలని కోరుతున్న బీజేపీ నేత వినయ్‌కుమార్, స్థానికులు

రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య పథకం అమలు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు జి. దామోదర్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సదస్సులో దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ... రిటైర్డ్ ఉద్యోగులకు కరువు భత్యం పూర్తి వాయిదాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రభుత్వానికి అమ్మిన పెన్షన్‌ను 15 సంవత్సరాలకు బదులు 12 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, రెండో పే కమిషన్ రిపోర్టును వెంటనే ప్రకటించి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రటరీ జనరల్ సి. చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, కోశాధికారి పి.పెంటయ్య, ఉపాధ్యక్షులు విశ్వనాథం, ఆర్.సీతారామయ్య, భాగ్యలక్ష్మి, సహాయ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ కష్టాలు తీరేదెప్పుడు?

అంబర్‌పేట పరిసర ప్రాంతవాసులకు తప్పని తిప్పలు

- ఏడాదిన్నరగా శ్రీరమణ చౌరస్తా నుంచి షెర్టాన్ హోటల్ వైపు పనులు
- కేవలం 150మీటర్ల నిర్మాణానికి తీవ్ర జాప్యం
- నిత్యం దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు. వాహనదారులకు ఇక్కట్లు




అంబర్‌పేట శ్రీరమణ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ దృశ్యాలు

అంబర్‌పేట: అంబర్‌పేట ప్రజలకు ఫ్లైఓవర్ కష్టాలు తీరడంలేదు. ఏళ్లు గడిచిన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో వేలాదిమంది ప్రజలు నిత్యం నరకయాతనకు గురవతున్నారు. ఒకటిన్నర కిలోమీటర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ఏడేళ్లు గడిచిన నేటికీ పూర్తి కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 24 గంటలు ఫ్లైఓవర్‌తో అవస్థలు పడుతున్నారు.

◆ వరంగల్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఈ ఫ్లైఓవర్ దారిలో రామంతపూర్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దారి తెలియక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టడుతున్నారు. ఎవరిని పలకరించిన అంబర్‌పేట ఫ్లైఓవర్ ఇంకెన్నాళ్లు అంటూ మండిపడుతున్నారు. దుమ్ము, ధూళి, ఫ్లైఓవర్ కింద అధ్వానంగా ఉన్న రోడ్లతో వాహనదారులు, పరిసరా ప్రాంతాల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

150 మీటర్లకు ఏడాదిన్నర..

◆ శ్రీరమణ చౌరస్తా నుంచి ముస్లిం శ్మశానవాటిక దాటి షెర్టాన్ హోటల్ వరకు నిర్మాణ కోసం దాదాపు ఏడాదిన్నర క్రితం ట్రాఫిక్ బంద్ చేశారు. ఇందుకు ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొంది ట్రాఫిక్ మళ్లిస్తున్నారు. ఏడాదిన్నరగా ఇక్కడ వాహనాలకు అనుమతి లేకపోవడంతో వాహనాదారులు అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నయ రోడ్లు సరిగ్గా లేక ఎలా వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల వద్ద తీసుకున్న అనుమతులను పొడగించుకుంటూ నిర్మాణ సంస్థ వాళ్లు చేస్తున్న వ్యవహారం పట్ల అంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇంత నిర్లక్ష్యమా?..

◆ నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే జాతీయ రహదారిపై నిర్మించే ఫ్లైఓవర్ నిర్మించడంలో అధికార యంత్రాంగంతో పాటు రాజకీయ పార్టీలు సహితం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. నిర్మాణ జాప్యానికి ఎవరిని ప్రశ్నించాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాప్రతినిధుల పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిసరా ప్రాంతాల ప్రజలు ఇంటిముందు ముగ్గు వేసుకునే పరిస్థితి లేదు. ఈ నిర్లక్ష్యాన్ని నివారించడంలో అంతా విఫలమవుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అంబర్‌పేట ఫ్లైఓవర్ తక్షణమే పూర్తి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అమ్మవారి చీరల వేలం

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధి గాంచిన మహంకాళి దేవాలయ అమ్మవారి చీరలను మంగళవారం ఆలయ ప్రాంగణంలో వేలం వేశారు. దేవాదాయశాఖ ఈవో మహేందర్‌కుమార్ పర్యవేక్షణలో కొనసాగిన వేలంపాటలో ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమౌళి, నాయకులు రాము, ఎయిర్‌టెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ముషీరాబాద్: తెలంగాణ దళిత సిల్ట్ వెహికిల్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానించారు. అధ్యక్షుడు మామిడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి.రామచంద్రల ఆధ్వర్యంలో ఓల్డ్ ఎమ్మెల్యే క్వాటర్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. కార్యనిర్వహక కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ సభ్యులు నర్సింగ్‌రావు, సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, రాము, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్యం



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న సాయివర్ధన్ కాంస్య పతకం సాధించాడు. 89 కేజీల విభాగంలో క్లీన్ అండ్ జర్క్ 142 కేజీలు, స్నాచ్ 111 కేజీలు ఎత్తాడు. మంగళవారం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్, డైరెక్టర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అడ్మిన్ ఆఫీసర్, ఫిజికల్ డైరెక్టర్, అధ్యాపకులు ఈ సందర్భంగా అభినందించారు.

ఆయుష్మాన్ భారత్ ఎంతో ఉపయోగకరం



ఆయుష్మాన్ భారత్ హెల్త్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: ఏడు పదుల వయసు దాటిన వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు ఎంతో ఉపయోగకరమని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ పేర్కొన్నారు. మంగళవారం ఈ పథకాన్ని ప్రధాని మోదీ ఢిల్లీలో వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం డివిజన్ పరిధిలోని డీబీఆర్ మిల్స్ హెల్త్ సెంటర్, దోమలగూడ యూపీహెచ్‌లో డాక్టర్ అవంతి, డాక్టర్ విజయలక్ష్మిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... మలివయసులో ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, ప్రభాకర్, రమేష్‌బాబు, దిలీప్‌యాదవ్, శ్రీనివాస్, స్టాఫ్ నర్సులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డును సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డును 70 ఏళ్లు దాటిన వారంతా సద్వినియోగం చేసుకోవాలని భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి సూచించారు. మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించిన కార్యక్రమాన్ని ప్రొజెక్టర్ ద్వారా భోలక్‌పూర్, ముషీరాబాద్ యూపీహెచ్‌సీలలో ప్రదర్శించారు. ఖర్చు లేకుండా వృద్ధులు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చని సూచించారు. వృద్ధులు ఆయుష్మాన్ భారత్ కార్డును పొందాలని పేర్కొన్నారు. ఆసుపత్రి ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల విష కోరలపై ఉక్కుపాదం మోపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహ

కాచిగూడ: హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని.. రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న డ్రగ్స్ మహమ్మారి విషకోరలపై ఉక్కుపాదం మోపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటి నరసింహ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాదక ద్రవ్యాల నిరోధానికి అనేక చట్టాలు ఉన్నా రేవ్ పార్టీలు, పబ్‌లు, బార్లు, రిసార్ట్‌లు, హోటళ్లలో డ్రగ్స్, గంజాయి చలామణిలో అవుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన టాలీవుడ్ డ్రగ్స్ కేసుకు సంబంధించి ఆధారాలు, సాక్ష్యాలు లేకపోవడంతో కేసులు కొట్టివేస్తున్నట్లు కోర్టు తెలిపిందని అన్నారు. సినీ పరిశ్రమకు చెందిన కొందరిని పోలీసులు కేవలం విచారించి వదిలేశారని గుర్తు చేశారు. డ్రగ్స్ పట్టుబడిన వారి విషయంలో పోలీసు యంత్రాగం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతం



ముషీరాబాద్: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వాఖ్యలు చేసిన స్వామిజీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ భోలక్‌పూర్ డివిజన్‌లో ముస్లిం జేఏసీ పిలుపు మేరకు మంగళవారం స్థానికంగా ఉన్న షాపులను మూసివేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. హోటల్స్, ప్లాస్టిక్, తోళ్లు, ఐరన్ షాపులను స్వతహాగా మూసివేయడంతో భోలక్‌పూర్ వెలవెలబోయింది. ముస్లింల ఆరాధ్యదైవమైన మహ్మద్ ప్రవక్తపై అనుచిత వాఖ్యలు చేయడం వల్ల ముస్లింల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

8గంటల్లో బాలుడి ఆచూకీ గుర్తింపు

ముషీరాబాద్: సామాజిక బాధ్యతతో నేరాల అదుపుకు ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ముషీరాబాద్ సీఐ రాంబాబు సూచించారు. భోలక్‌పూర్‌కు చెందిన మూడేళ్ల బాలుడు తాజ్ అహ్మద్ కిడ్నాప్‌కు గురి కావడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ముషీరాబాద్ పోలీసులు సకాలంలో స్పందించి 8గంటల్లో బాలుడి ఆచూకీ కనుగొన్నందుకు ముషీరాబాద్ పోలీసులను అభినందిస్తూ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అక్లక్ హుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం సీఐ రాంబాబు, ఎస్సై ప్రసాద్‌రెడ్డితో పాటు కానిస్టేబుల్స్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రాహుఫ్, రహీం, కానిస్టేబుల్స్ మహేష్, సాయికుమార్, ప్రకాష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

రంగారెడ్డి జిల్లా కార్మిక సంయుక్త కమిషనర్ శ్యాంసుందర్‌రెడ్డి



చిక్కడపల్లి: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం రంగారెడ్డి జిల్లా కార్మిక సంయుక్త కమిషనర్ (జేసీఎల్) శ్యామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా భవన, ఇతర నిర్మాణ కార్మిక గుర్తింపు కార్డు(ఓబీసీ) నమోదు కోసం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. కార్మికశాఖ రంగారెడ్డి జిల్లా జోన్ పరిధిలో 1,156 నిర్మాణ ప్రదేశాల్లో ఈస్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. ఆగస్టు 28 నుంచి అక్టోబర్ 2వరకు జరిగిన ఈ డ్రైవ్‌లో మొత్తం 58,168 మంది భవన నిర్మాణ కార్మికులను గుర్తించామని అన్నారు. ఇందుల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు 49,446మంది ఉన్నారని, రాష్ట్రానికి చెందిన కార్మికులు 2,457 మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటికే ఇందులో వలస కార్మికులు 2,392 మందికి గుర్తింపును ఇచ్చారని తెలిపారు. మిగతా వారికి కూడా ఓబీసీ కార్డులు అందజేస్తామని చెప్పారు.

విద్యాశాఖ మంత్రి లేకుంటే సమస్యలు ఎవరితో చెప్పాలి?

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి. నాగరాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి లేకుండా సమస్యలు ఎవరితో చర్చించాలని వారు ప్రశ్నించారు. మంగళవారం చిక్కడపల్లిలోని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో ఫీజు దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమస్యలు పరిష్కరించాలని అడిగిన వారిపై నిర్బంధాలు విధించడం సరైంది కాదన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి చెల్లించలేదని చెప్పారు. ప్రైవేటు యాజమాన్యాలు సమ్మె చేస్తే చర్చలు జరిపిన ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. టోకెన్ ఇచ్చిన బిల్లులు కూడా విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ అధ్యక్షులు కోట రమేష్, నాయకులు వెంకటేష్, న్యూ ఎరా విద్యా సంస్థల కరస్పాండెంట్ శ్రావణ్‌కుమార్, విజయ్ కుమార్, ఎండీ జావెద్, ఎం. పూజ, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు: పీడీఎస్‌యూ

ముషీరాబాద్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆజాద్‌లు విమర్శించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటి సమావేశం విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. తెలంగాణలో గత మూడేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన రూ.6,350 కోట్ల బకాయిలు విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. అధికారంలోకి వస్తే రాష్ట్రంలో విద్యా రంగాన్ని గాడిలో పెడతానని తెలంగాణ విద్యార్థి లోకానికి హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంలానే వ్యవహరిస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించకుండా విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. వెంటనే నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్, నరేందర్, అనిల్, సహాయ కార్యదర్శులు సాయి, అఖిల్, కోశాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫీజు దీక్షలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు పి.రామకృష్ణ తదితరులు

31న నింబోలిఅడ్డ సదర్ ఉత్సవ్ మేళా

కాచిగూడ: దీపావళి పండుగను పురస్కరించుకుని ఈనెల 31వ తేదీన గురువారం నింబోలిఅడ్డలో సదర్ ఉత్సవ్ మేళాను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కన్నె రమేష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం నింబోలి అడ్డలో ఆయన మాట్లాడుతూ... 'సదర్ ఉత్సవ్ మేళా'కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ మంత్రులు సి. కృష్ణయాదవ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్, హిమాయత్‌నగర్, నూర్‌ఖాన్‌బజార్, అంబర్‌పేట, గోల్నాక, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాలగుండా అలంకరించిన దున్నపోతులతో పెద్ద ఎత్తున ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. దున్నపోతు ఊరేగింపు తీసే ప్రతి యాదవుడికి ఈ సందర్భంగా అభినందన సత్కారంతో పాటు మెడల్‌ను ప్రదానం చేస్తామన్నారు.

అభ్యుదయ సాహిత్య వైతాళికుడు కొడవటిగంటి కుటుంబరావు



చిక్కడపల్లి: కొడవటిగంటి కుటుంబరావుకు ముందు అభ్యుదయ సాహిత్య ఆలోచనతో రచనలు చేసినా వారు స్పష్టమైన ప్రగతిశీల దృక్పథంతో సాహిత్య సృష్టి చేశారని హస్యావధాని, సీనియర్ జర్నలిస్ట్ శంకరనారాయణ అన్నారు. మంగళవారం గానసభలో 'కొడవటిగంటి కుటుంబరావు యాదిలో..'పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శంకరనారాయణ మాట్లాడుతూ.. కొడవటిగంటి రచనలు హేతుబద్ధంగా ఉంటాయని అన్నారు. ఆయన సామాజిక అంశాలు తర్కబద్ధంగా ఆలోచించి పాఠకుడిలో ఆలోచనలు రేకెత్తిస్తారని ఇందుకు ఉదాహరణ ఆయన రాసిన చదువు నవల అని వివరించారు. సినిమా రచయితగా కూడా ఆయన విజయ సంస్థకు పని చేశారన్నారు. చందమామ కథల పత్రికను రూపుదిద్ది ఆసక్తిని ప్రజల్లో కలిగించటంలో ఆయన కృషి ఉందని గుర్తుచేశారు. గానసభ అధ్యక్షుడు వీఎస్ కళాజనార్దనామూర్తి అధ్యక్షత వహించిన సభలో కథక్ నాట్యగురువు డాక్టర్ అంజిబాబు, అభినందన సంస్థ స్థాపకురాలు భవాని పాల్గొన్నారు.

శతాబ్ది గాయకుడు ఘంటసాల

కాచిగూడ: అమర గంధర్వ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుపై బయోపిక్ సినిమాను ప్రముఖ నిర్మాత సీహెచ్ రామారావు అద్భుతంగా నిర్మించారని బీజేపీ సంస్థాగత రాష్ట్ర ఎన్నికల కోరిటర్నింగ్ అధికారి కె.గీతామూర్తి అన్నారు. ఎన్నారై మహేష్, ఘంటసాల అభిమాని చల్లా సుబ్బారాయుడు మంగళవారం కాచిగూడకు చెందిన కె.గీతామూర్తిని కలిసి ఘంటసాలపై రాసిన 'శతాబ్ది గాయకుడు ఘంటసాల'పుస్తకం బహూకరించారు.

తైక్వాండోలో విద్యార్థి ప్రతిభ

కవాడిగూడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ – 17 తైక్వాండో పోటీలలో కవాడిగూడకు చెందిన ఇంగ్లిష్ యూనియన్ స్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థి మహ్మద్ హర్షద్ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. మలేషియాలో 2023–24కు నిర్వహించిన ఇంటర్నేషనల్ తైక్వాండో పోటీలలో కూడా గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ చైర్మన్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం తైక్వాండోలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మహ్మద్ హర్షద్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ స్వర్ణలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ



అంబర్‌పేట: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్మశానవాటికలో చేపట్టే పూజలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని మోయిన్ చెరువు శ్మశానవాటికలో పారిశుద్ధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. శ్మశానవాటికలో పరిశుభ్రతకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బందితో పాటు బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో ముదిరాజ్‌ల వివరాలు అందించాలి

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కులగణనలో ముదిరాజ్ కులస్తులు తమ వివరాలకు ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి అందించాలని అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్లుముదిరాజ్ సూచించారు. కులగణన ద్వారా ముదిరాజ్‌ల జనాభా తెలుస్తుందని, దీంతో ముదిరాజ్‌లు రాజకీయంగా, సామాజిక, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. ముదిరాజ్‌ల జనాభా ఆధారంగానే అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సీట్లను కేటాయిస్తాయన్నారు. జనగణనలో ముదిరాజ్‌లు బాధ్యతగా పాల్గొనాలని కోరారు.

పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీ

కాచిగూడ: పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. జిల్లెలగూడ, సాయినగర్ ప్రాంతానికి చెందిన బి.వెంకటయ్య నింబోలిఅడ్డలో తన ద్విచక్ర వాహనాన్ని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ముందు పార్కింగ్ చేశారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లోకి వెళ్లి తిరిగి వచ్చేలోగా తన ద్విచక్రవాహనం హోండా యాక్టివా చోరీకి గురైంది. దీంతో అతను కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుంటే ప్రపం వ్యాప్తంగా మంచి అవకాశాలు లభిస్తాయని రిటైర్డ్ వింగ్ కమాండర్ అనీష్ ఆంథోని, ప్రముఖ విద్యావేత్త భరణికుమార్ అన్నారు. మంగళవారం నగరంలో జఠాధార ఎడ్యూకేషనల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జట్ ఇంజినీర్స్ క్లబ్‌ను ప్రారంభించారు. క్లబ్‌ను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ... ఈ క్లబ్ ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ఉద్యోగాలకు అవసరమయ్యే నైపుణ్యాన్ని నేర్చుకోవచ్చని తెలిపారు. ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ... ఎప్పటికప్పుడు నిరంతరం అభివృద్ధి చెందే టెక్నాలజీపై పట్టు సాధించడానికి ఈ క్లబ్ దోహదపడుతుందని అన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రసిద్ధి చెందిన కంపెనీలలోని పారిశ్రామిక నిపుణులచే మార్గదర్శకం పొందవచ్చన్నారు.